కథ

# ఒక అమెరికా... సమస్త జీవులకు...

గంటి భానుమతి



"మీతో ఈ మాట చెప్పడానికి బాధగా ఉంది. కానీ, చెప్పక తప్పదు" అంటూ చిదానందమూర్తి ఓ సోఫాలో కూచున్నారు.

వచ్చింది చిదానందం, అంటున్నది చిదానందం కాబట్టి, కొంచెం అర్థం అయింది శారదకి, వెంకటేశ్వరావుకి.

"మీ సంబంధం వొద్దన్నారు..."

పూర్తిగా అర్థం అయింది ఆ దంపతులకి. చిదానందాన్ని చూడడం మినహా మరేం చెయ్యలేకపోయారు.

"వాళ్ళు చెప్పిన కారణాలు విన్నాక, వాళ్ళకోణం లోంచి చూస్తుంటే, సబబుగానే అనిపించింది..." ఓసారి వాళ్ళిద్దరి వైపు చూసి, ఆపి, మళ్ళా అందుకున్నారు.

"ప్రపంచ మార్కెట్‌లో షేర్లు, మరోటీ మరోటీ విలువలు పడిపోయినట్టే ఈ పెళ్ళికొడుకుల విలువ కూడా పడిపోయింది. ఈ పింక్ స్లిప్‌లు, జీతాల్లో కోతలు ఏ క్షణాన ఊడిపోతాయో తెలియని ఉద్యోగాలు, దిన దిన గండం-నూరేళ్ళాయుష్షులాగా ఉద్యోగాలుంటే... సంసారం ఎలా గడుస్తుంది..." ఆగి, వాళ్ళ మొహాలు చూసి,

"అలా అని నేనడం లేదు.... వాళ్ళన్నారు..."

నిశ్చేష్టులయ్యారు.

"అక్కడికీ... మధ్యవర్తిగా నా ప్రయత్నం నేను చేసాను. ఆ పిల్ల ససేమిరా వొద్దంది"

''ఈ విషయాన్ని మా పిల్లాడెలా తీసుకుంటాడో! ఎలా తట్టుకుంటాడో తల్చుకుంటేనే బాధగా ఉంది. అసలే... మనసు బాగాలేదు. పులి మీద పుట్రలా ఇదోటి. ఊహించడానికే భయంగా ఉంది'' అంది శారద గద్గద స్వరంతో.

చిదానందం సానుభూతితో వాళ్ళని చూసాడు. మెల్లిగా తల ఊపాడు.

''నాకు తెలుసమ్మా.... నేనర్థం చేసుకోగలను. ఏం చేయను? నిమిత్తమాత్రుణ్ణి, తట్టుకోవడం కష్టం. ఓ అమ్మాయి అబ్బాయిని తిరస్కరించిందంటే.... ఇమోషనల్‌గా చాలా ఫీలవుతారు. అక్కడెక్కడో అమెరికాలో ఓ లీమాన్ బ్రదర్స్ పేక ముక్కల్లా కూలిపోవడం ఏంటీ, దాని ప్రభావం ప్రతీ దానిమీద పడటం ఏంటీ, విడ్డూరం కాదా! పోతనగారన్నట్లు, ఒక సూర్యుడు సమస్త జీవులకు దానొక్కొక్కడై దోచు... లాగా.... ఓ లీమాన్ సమస్త రంగాల్నీ, అన్నీ దేశాలనీ కుదిపేసింది. మార్కెట్ కూలిపోయింది. ఆఖరికి పెళ్ళిళ్ళ మార్కెట్...''

''ఇందులో మావాడి తప్పేం ఉంది? ఈ సంక్షోభం వాడు చెయ్యలేదు కదా!''

''ఇలాగే, కొంచెం అటూ ఇటూ మాటల తేడాతో అన్నాను. కానీ అమ్మాయి, ఆ పిల్ల తల్లీ వినడం లేదు. ఐ.టీ. వద్దు, ఫైనాన్స్ బ్యాంకింగ్ వాళ్ళు వద్దు. వేరే గవర్నమెంటాఫీసరు, డాక్టరు సంబంధాలు చూడమని అన్నారు. అంతా అమెరికా మహత్యం... అనుకోండి. ఎక్కడ వెతకాలీ? ఎంత మందిని వెదకాలీ? ఎవర్నీ అనడానికి ఏం లేదు... మనుషులు మెటీరియలిస్టిక్‌గా తయారయ్యారు...''

చిదానందం మాటలెప్పుడాపారో, ఎప్పుడు వెళ్ళిపోయారో కూడా ఆ దంపతులు గమనించలేదు. అలాగే కూచుండిపోయారు. లేవలేదు. జరిగిన దాని గురించి మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండిపోయారు. రాబోయే పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో, దానిక్కావలసిన ధైర్యాన్ని వెతుక్కోడంలో ఉన్నారు.

రాత్రి పది గంటలకి వచ్చిన వినయ్‌కి, ఎలా చెప్పాలా అన్న సందిగ్ధంలో ఉన్నారు శారదా, వెంకటేశ్వర్రావులు.

సెల్ తీసి, శ్రేయకి ఫోన్ చేసాడు. కట్ అయింది. మరోసారి... మళ్ళీ కట్ అయింది.

మెల్లిగా శారద ఆ సెల్ తీసి, పక్కన పెట్టి...'' ఇంక శ్రేయకి చేయాల్సిన అవసరం లేదు...'' అంది.

అంతా విన్నాక, వినయ్‌కి ప్రపంచం తలకిందులయినట్లుగా ఉంది. ఉద్యోగం పోయి, ఆ షాక్ లోంచి యింకా తేరుకోకముందే మరో షాక్. అమ్మాయి తిరస్కరించింది. ఈ సమయంలోనా!

ఇన్ని రోజులూ రోజుకి ఓ రవయిసార్లయినా ఫోన్‌చేసి మాట్లాడిన మనిషి... ఈ రోజున తనేం కాడా!

ప్రతి మనిషికి, దేవుడు ఎ ం వైపున ఓ చిన్న మాంసం ముద్దని పెట్టాడు. దానికి జవాబు చెప్పుకోనక్కర్లేదా!

చదువుకున్న శ్రేయ... యిలా అనగలదా! ఆశ్చర్యం. ఆమె చదువు ఎన్నో మంచి గుణాలు, విశాల భావాలు, ఆధునిక ఆలోచనలు యివ్వాలి, అని అనుకున్నాడు, కానీ అలా జరగలేదు. ఆమె చదువు ఆమెకేం యివ్వలేదా!

ఈ చదువుల లక్ష్యం ఏఁవిటో అర్థం కాలేదు. ఇంత సంకుచితంగా, ఎక్కువ తక్కువలుగా, శ్రేయ ఆలోచించిందంటే, వినయ్‌కి నమ్మకం కుదరలేదు.

ఇన్ని రోజులూ, ఆమెలో ఏమి చూసి, తనకి తగిన భార్య అని అనుకున్నాడు? ఆమె తెలివి, ధైర్యం, చొరవ, చదువు, ఉద్యోగం, అన్నీ చూసి అనుకున్నాడు. కానీ, ఆమె తెలివి, చొరవ, చదువూ అన్నీ కూడా తన ఉద్యోగం జీతం చూసి, తనని మరిపించడానికే! తనకో తోడుగా నిలిచి, మానసికంగా ధైర్యం యివ్వాల్సిన ఆమె, యిలా కూడా ప్రవర్తించగలదా! ఓ మామూలు ఆడదానిలా, డబ్బే ముఖ్యమనుకునే అమ్మయిలా! డబ్బు ముఖ్యమే... కానీ... దానికింతగా దిగజారాలా!

మళ్ళా చేసాడు. అయితే ఈసారి తల్లితండ్రి చూస్తుండగా కాదు. గదిలోకి వెళ్ళి, తలుపులేసుకుని చేసాడు.

తలుపు దగ్గరే నుంచున్నారు శారదా, వెంకటేశ్వర్రావులు.

ఈసారి శ్రేయ మాట్లాడింది.

''నువ్వు విన్నది నిజమే. రెండు రోజుల్నించి, నీకెలా చెప్పాలా అని అనుకుంటున్నాను. నిన్న చిదానందం గారు వస్తే, నేనే చెప్పాను. కొంచెం ఫీలయ్యాను కానీ, చెప్పక తప్పదు. నువ్వు నా వైపు నుంచి కూడా ఆలోచించాలి. ఇది జీవితం. ఓ సంసారం నడవాలంటే, ఎన్నోకావాలి. ఇంటద్దెలెంత ఉన్నాయో నీకు తెలీదా! బియ్యం, పప్పులు, నూనె, కూరలు... ఆఖరికి చిన్న అగ్గిపెట్టె కూడా... అన్నీ ఖరీదైపోయాయి. నా ఒక్క జీతంతో ఏం బతుకుతాం నువ్వే ఆలోచించు అదే నేనూ ఆలోచించాను. అన్ని వైపుల నుంచి ఆలోచించాను. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. నాకు తప్పుగా అనిపించడం లేదు... ఒకవేళ నీకనిపిస్తే...నేనేం చెయ్యలేను... సారీ''

''నా పరిస్థితి.... ఎప్పటికీ యిలాగే ఉంటుందనుకుంటున్నావా! ఇంతకన్న మంచి ఉద్యోగం రావచ్చు...''

''ప్చ్... నా తత్వం వేరు. అద్భుతాలు జరుగుతాయనుకోవడం, దాని కోసం ఎదురు చూడడం... ఎన్నిరోజులు? నువ్వే చెప్పు...''

వినయ్‌కి ఏం సమాధానం యివ్వాలో తెలీయలేదు.

''కాలంతో పాటూ నడిస్తేనే, సమాజంతో పాటు నడిచినట్లవుతుంది... వెనక పడిపోతే... ఆగిపోతే... అవకాశాలు కోల్పోతాం...''

''శ్రేయా! ఇది ఉద్యోగం కాదు... అవకాశాలు అని అనుకోడానికి... జీవితం...''

''తెలుసు వినయ్. ఇది జీవితం అని తెలుసు. అందుకే ప్రాక్టికల్‌గా ఆలోచించాను'' ఏమూలో చిన్న ఆశ... అందుకే ఈ పెళ్ళిని కాన్సిల్ చేయడానికి ష్టపడడం లేదు.

''పోనీ, పెళ్ళి వాయిదా వేద్దాం. మంచి ఆఫర్ వచ్చాకే చేసుకుందాం. కానీ...ప్లీజ్... పెళ్ళి వద్దని అనకు...''

''సారీ... వినయ్.... నా మనసుని సమాధాన పర్చుకోడానికి చాలా రోజులు పట్టింది. ఇంక మళ్ళీ మార్చుకోవడం కష్టం. అయినా ఈ సునామీ ఎన్ని రోజులో ఎవరికి తెలుసు? పోనీ, యిదే ఆఖరు అని అనుకోడానికి లేదు. ఇది మొదలు. స్థిరం తక్కువ ఈ ఐ.టి. ఉద్యోగాలకి. ఎప్పుడూడిపోతాయో ఎవరికీ తెలీదు;

అయినా సుఖ సంతోషాలతో జీవించే హక్కు నాక్కూడా ఉంది వినయ్. నీతో సమానంగా కన్నీళ్ళు కారుస్తూంటే, ఉద్యోగాలొచ్చేస్తాయా! ఈ ఉద్యోగాలన్నీ ఇసుక మీద కట్టిన బొమ్మరిళ్ళు...''

''ప్లీజ్... అంత కఠినంగా మాట్లాడకు... రేపట్నించి, నేనెలా మొహం చూపించాలి...?''

''డిట్టో...డిట్టో...నేను అలాగే అనుకుంటున్నాను. రేపట్నించి నా ఫ్రెండ్స్ అంతా అడగరా! ఎందులో?... ఎంత జీతం? ఏ దేశాల ప్రాజెక్ట్‌లున్నాయి... ఇలాంటివి... ఎన్నో అడుగుతారు. ఏం చెప్పాలి? ఏం చెప్తాను? ఎంత ఎంబర్రాసింగ్‌గా ఉంటుంది!... నువ్వే ఆలోచించు''

ఆశ్చర్యం వేసింది వినయ్‌కి.

''అదేంటి శ్రేయా! సమాజంలో నీ స్థానం, నీ విలువ-, నా హోదా నా ఉద్యోగం, జీతం వల్ల వస్తుందా! ఆశ్చర్యం... ఈ భావాలు భూమి పుట్టిన్నాటినుంచి వస్తున్నవే. ఇవి పాత భావాలు...

ఇన్ని రోజులూ, ఆమెలో ఏమి చూసి, తనకి తగిన భార్య అని అనుకున్నాడు? ఆమె తెలివి, ధైర్యం, చొరవ, చదువు, ఉద్యోగం, అన్నీ చూసి అనుకున్నాడు. కానీ, ఆమె తెలివి, చొరవ, చదువూ అన్నీ కూడా తన ఉద్యోగం జీతం చూసి, తనని మరిపించడానికే! తనకో తోడుగా నిలిచి, మానసికంగా ధైర్యం యివ్వాల్సిన ఆమె, యిలా కూడా ప్రవర్తించగలదా! ఓ మామూలు ఆడదానిలా, డబ్బే ముఖ్యమనుకునే అమ్మయిలా! డబ్బు ముఖ్యమే... కానీ... దానికింతగా దిగజారాలా!

నువ్వు ఈ రోజుకి ప్రతినిధివి. ఈ తరానికి ప్రతి నిధివి. నీ ప్రవర్తన, నీ వ్యక్తిత్వం, నీ చదువు, నీ సంస్కారం, నీ అస్తిత్వం నీకు విలువనిస్తాయి. భర్త ఉద్యోగం, జీతం, హోదా నీతో చేర్చుకుని, నీ విలువని పెంచుకుంటావా!

నీ ఉద్యోగం పోతేనేం, నా ఉద్యోగం ఉంది అంటావని, యిన్ని రోజులు ఎదురు చూసాను. కానీ, అలా అనలేదు. నీకసలు ఫీలింగ్స్ లేవు. నీదంతా లెక్కల ఫార్ములాలతో ఉన్న ఫీలింగ్స్. ఎక్కడా లెక్క తప్పకూడదు... కదూ...''

సమాధానం రాలేదు.

''నీతో, యిప్పుడు మాట్లాడాకా, నేనెంత అదృష్ట వంతుడినో తెలుస్తోంది. పెళ్ళికి ముందరే, నీకేం కావాలో, నానుంచి ఏం కోరుకుంటున్నావో తెలిసింది. ఇదే పెళ్ళయ్యాకా జరిగి ఉంటే... విడాకులు తీసుకోడానికి కూడా వెనకాడేదానివి కాదు... పర్వాలేదు శ్రేయా... నేను ఆశావాదిని. ఓ మంచి రేపుంది. నా కోసం వచ్చేరేపు. జీవితాన్ని మార్చే రేపు... ఈ చీకటిని చీల్చుకుంటూ వచ్చే రేపు... దాని పేరు ఆశ... పర్వాలేదు...''

''నాకు తెలుసు వినయ్. నువ్వు నా పరిస్థితిని అర్థం చేసుకుంటావని... పరిస్థితులలా ఉన్నాయి... నేనేం చేయను... చెప్పు...''

సెల్ టక్కున కట్టేసాడు.

పెద్ద అనుభవం... గొప్ప పాఠం నేర్చుకున్నాడు. ఫీజు బాగానే చెల్లించాడు. పరిస్థితులు, పరిసరాలు మనుష్ముల్ని వేరు చేస్తుంది అని అనుకున్నాడు.

కిటికీ లోంచి చీకట్లోకి చూస్తూండి పోయాడు. ఎంతసేపు అలా ఉన్నాడో వినయ్‌కి తెలియలేదు.


తలుపుకొట్టిన శబ్దం... తలుపు తీసాడు. శారదా, వెంకటేశ్వరావులు. ''ఏం చేస్తున్నావు?'' అని శారద కొడుకు చేయి పట్టుకుంది.

తల్లి భుజం మీద చేయి వేసాడు వినయ్.

''భయపడ్డారా...ఏమ్మా! భయపడ్డావా! నేనేదయినా భయంకరమైన అడుగు వేస్తానేమోనని...'' అంటూ తల్లిని సోఫాలో కూచోపెట్టాడు. ''నీతో కొంచెం మాట్లాడాలి'' అని వెంకటేశ్వర్రావు వినయ్‌తో అన్నాడు.

''భూమి గుండ్రంగా ఉందని కొలంబస్ అన్నాడు. కానీ, ఈ ఐ.టి. రంగం వచ్చాకా భూమి చదునుగా ఉండిపోతోంది. అందుకే ప్రయాణం చేస్తూంటే, భూమి అంతం అయిపోయిందేమో, పడిపోతామేమో అన్న భయం అందర్నీ ఆవరిస్తోంది. వరల్డ్ ఈజ్ ఫ్లాట్.

కొలంబస్ లాగా తెలియని ప్రపంచం అమెరికా వెళ్ళావు. అక్కడ భూమి చదును. ఏ రోజున అంతం అవుతుందో తెలియని పరిస్థితి. దగ్గరికొస్తేనే తెలుస్తుంది అది చదునుగా ఉందో, లోయగా, కిందకి దిగిపోయిందోనని. చేయించుకున్న పనికి సరిగా





# మీరే డిటెక్టివ్ అయితే...!?

- మల్లాది వెంకటకృష్ణ మూర్తి

## బెస్ట్ ఫ్రెండ్


విశ్వం తన భార్యని రహస్యంగా చంపాడు. కాని విశ్వం బెస్ట్ ఫ్రెండ్ జిమ్, విశ్వం తన భార్యని చంపిన కత్తిని పోలీసులకి అందజేసాడు. ఏం జరిగింది?

క్లూ: 1. విశ్వం భార్యంటే జిమ్‌కి ఇష్టం లేదు.

క్లూ: 2. విశ్వం తన భార్యని చంపాక ఆ కత్తిని ఓ బట్టలో చుట్టి తన ఇంటి వెనక పాతిపెట్టాడు.

క్లూ: 3. జిమ్ ఆ కత్తిని తవ్వితీసి పోలీసులకి ఇచ్చాడు.

క్లూ: 4 పూర్వం కొందరు దొంగలని కూడా పోలీసులకి పట్టించాడు.



జీతాలివ్వడం లేదని, బెంగుళూరు వచ్చేసావు. ఇక్కడ కూడా భూమి చదునే.

కొత్త అవకాశాలు, కొత్త ప్రాజెక్టులు, కొత్త సహాధ్యాయులు, కొత్త భాగస్వాములు, కొత్త ఛాలెంజ్‌లు, కొత్త పాఠాలు, కొత్త ప్రమాదాలు... తెలియనివి ఊహించనివి... అందుకే ఈ ప్రపంచీకరణ మనుషుల్ని దగ్గర్నుంచి చూసే అవకాశం కల్పించింది. ప్రేమనిచ్చింది. సంస్కారాన్నిచ్చింది. స్నేహాన్నిచ్చింది. దానితో పాటూ విధ్వంసాన్ని కూడా యిచ్చింది. ఇది అంగీకరించాల్సిందే... కదా...'' అంటూ వెంకటేశ్వర్రావు ఓ సోఫాలో కూచుని వినయ్‌ని చూస్తూ అన్నారు.

వినయ్ ఏం అనకుండా, అక్కడే ఉన్న కుర్చీపైన చేత్తో రాస్తూండిపోయాడు.

''కూచో...'' వినయ్ తండ్రి ఎదురుగా, డైనింగ్ కుర్చీని లాక్కుని కూచున్నాడు.

''శారదా! మంచి కాఫీ చేసి తీస్కురా... స్ట్రాంగ్‌గా ఉండాలి. నెస్‌కాఫీ వద్దు. డికాషన్ కాఫీ... తెలిసిందా!... కాఫీ తోరా... అంతేగానీ, మధ్యలో రాకు...'' అంటూ శారదని వంటింట్లోకి పంపించేసారు.

''నీ తప్పులేనప్పుడు, నువ్వు సిగ్గుపడాల్సింది లేదు. నీ వైఫల్యం అని అనుకుంటే, అది నిరాశకి కారణం కాకూడదు. ఇందులోంచి కొత్త ప్రేరణ రావాలి. దానికీ పునాది కావాలి...

ఈ క్షణాన నీకున్నవి, కలిగే భావాలు శాశ్వతంగా ఉండవు. చాలా కాలం ఉండవు....''

'ఇన్ని రోజులూ శ్రేయ వల్ల కలిగిన అనుభవాలు, అనుభూతులు అబద్ధమా! అవి నన్ను బంధించినట్లు ఆమెను బంధించలేదా!' మనసులో అనుకున్నాడు వినయ్.

నిశ్శబ్దంగా ఉన్న కొడుకుని చూసి, కళ్ళు మూసుకుని, తల ఓసారి అడ్డంగా తిప్పి, కళ్ళు తెరిచారు.

''అవును వినయ్, కోపం, ద్వేషం, కృతజ్ఞత, ఇవన్నీ కూడా అప్పటికప్పుడు కలిగే అనుభూతులు. మొదట్లో బలంగా ఉన్నా రాన్రాను బలహీనపడ్తుంది... అలాగే అభిప్రాయాలు కూడా చంచలంగా మారిపోతూంటాయి...''

''.....''వినయ్ వేళ్ళని చూస్తూండిపోయాడు.

''బయట ప్రయాణం చేస్తూంటే, జాగ్రత్తగా వెళ్తావా లేదా! ఎదురొస్తున్న అడ్డొస్తున్న వాహనాలని తప్పించుకుంటావా లేదా! చెప్పు. పక్కకి తప్పుకుని వెళ్తావు కదా!

అలాగే మనసు చేసే ప్రయాణంలో కూడా, అంతే జాగ్రత్తగా ప్రయాణం చెయ్యాలి. అక్కర్లేని ఆలోచనల, అడ్డొస్తున్న ఆలోచనలని తోసుకుంటూ, మనసుని విశాలం చేసుకుంటూ వెళ్ళాలి...

భవిష్యత్తు వైపు భయంగా చూసావనుకో, వర్తమానంలో నువ్వు చెయ్యాల్సింది మర్చిపోతావు... అప్పుడు నీ మనసుని పారేసుకోవడానికి అవకాశాలే ఎక్కువ. అప్పుడు ఓ మానసిక రోగివయిపోతావు... అది నాకిష్టం లేదు...

ఇంజనీరింగ్ చదివిన నా కొడుకు ఓ పిచ్చోడిలా అయిపోవడం నేను సహించను. సమయాన్ని జయించి, ఈ రోజు నాది అని అనుకున్ననాడు సంతోషంగా ఉంటావు.

నీ యిష్టం ఎలా మిగలాలని అనుకుంటావో... అన్నది నీ ఛాయిస్...''

వినయ్‌లో చలనం... కళ్ళల్లో తడి... కృతజ్ఞతగా తండ్రి వైపు చూసాడు.

''నిజమే. ఎలా మిగలాలి? నా ఛాయిస్ ఏమిటీ?

యుద్ధాన్ని గెల్చిన వీరుడిలా, మృత్యు ముఖం వరకూ వెళ్ళి తిరిగొచ్చిన అమర్త్యుడిలా, సంక్షోభాన్ని ఉండ చుట్టేసి, ఎడం చేత్తో అవలకి పడేసేంతటి బలవంతుడిలా... ఎలా... ఛాయిస్ నాదే. ఈ క్షణాన నేను డిప్రెస్‌డ్ కానీ డిఫీటెడ్ కాదు'' అని అనుకుంటూ రెట్టింపు ఉత్సాహాన్ని సరఫరా చేస్తున్న వేడి కాఫీని తాగుతూ కంప్యూటర్‌లో ఉద్యోగాలు చూడ్డంలో మునిగిపోయాడు. కాలెండర్‌లో తేదీ మారింది.